సాక్షి వరంగల్

మంగళవారం | 6 | మే | 2025



'సోలార్'పై విముఖత

భారీ పెట్టుబడి, గిట్టుబాటు కాని ధర, రుణంపై బ్యాంకర్లకు స్పష్టత లేకపోవడంతో సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు రైతులు ఆసక్తి చూపడం లేదు. - 8లో▸



సరస్వతి పుష్కరాల ఏర్పాట్లు ముమ్మరం - 8లో▸

కాళేశ్వరంలో ఈ నెల 15 నుంచి 26వ తేదీ వరకు జరిగే సరస్వతి నది పుష్కరాలకు అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం $38^0/25^0$

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో ఎండ ఉంటుంది. సాయంత్రం వేళ ఆహ్లాదంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

విలువలతో కూడిన విద్య అవసరం

- జిల్లా అకడమిక్ కోఆర్డినేటర్ సుజన్‌తేజ



వర్ధన్నపేట: విద్యార్థులకు విలువలతో కూడిన విద్య ఎంతో అవసరమని జిల్లా అకడమిక్ కోఆర్డినేటర్ సుజన్‌తేజ అన్నారు. వర్ధన్నపేట ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాన్ని సోమవారం ఆయన సందర్శించి మాట్లాడారు. విద్యార్థులకు 15 రోజుల పాటు ప్రతిరోజు ఉదయం 8 నుంచి 11 గంటల వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. కలెక్టర్ సత్యశారద ఆదేశాల మేరకు 50 పాఠశాలల్లో శిబిరాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఎంఈఓ శ్రీధర్ మాట్లాడుతూ శిబిరంలో 100 మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. పాఠశాల చైర్‌పర్సన్ లక్ష్మీబాయి, ఉపాధ్యాయులు పర్వత రమణారావు, ఎన్‌సీసీ అధికారి మనుజేందర్‌రెడ్డి, మైదం అశోక్, పల్లె మదన్ మోహన్, బరిగెల దేవయ్య, లలిత్‌కుమార్, రోహిణీదేవి, సునీత, కుమారస్వామి, మంజుప్రియ, జయంజలి, అరవింద్, సుధారాణి, స్వర్ణకుమారి, రేఖ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి టోల్ ఫ్రీ నంబర్

వరంగల్: జిల్లా వ్యాప్తంగా తాగునీటి సమస్య తలెత్తితే కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్ 1800 425 3424కు సమాచారం అందించాలని కలెక్టర్ డాక్టర్ సత్యశారద సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. తాగునీరు రాకపోయినా, పైపులైన్ లీకేజీలు ఉన్నా, తాగునీటి ఇబ్బందులపై టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేస్తే అధికారులు తక్షణమే సమస్య పరిష్కరిస్తారని కలెక్టర్ పేర్కొన్నారు.

పెండింగ్ పనులు పూర్తిచేయాలి

- డీఆర్‌డీఏ ప్రాజెక్టు మేనేజర్లు దయాకర్, అనిత



వర్ధన్నపేట: మహిళా సంఘాల ఆర్థిక, సామాజిక అభివృద్ధిలో వీఓఏలు కీలకమని డీఆర్‌డీఏ ప్రాజెక్టు మేనేజర్లు మునిగాల దయాకర్, అనిత అన్నారు. మండల కేంద్రంలోని సెర్ప్ కార్యాలయంలో సోమవారం గ్రామైక్య సంఘాల సహాయకుల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాలను నిర్దేశించిన గడువులోగా పూర్తిచేయకుండా ఉండడం వీఓఏల అలసత్వమేనన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. పెండింగ్ పనులు వారం రోజుల్లోగా పూర్తి చేయాలని, మహిళా సంఘాలు క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించుకోవాలని సూచించారు. అనంతరం మండల సమాఖ్య ఆధ్వర్యంలో వీఓఎలకు జ్యూట్ బ్యాగులు పంపిణీ చేశారు. సమావేశంలో లింకేజీ డీపీఎం అనిత, ఏపీఎం ప్రేంరాజు, వేణు, యాంకర్ పర్సన్ రవికృష్ణ, సీసీలు గోలి కొమురయ్య, రమేశ్, స్వామి, మండల సమాఖ్య అధ్యక్షురాలు అరుణ, ఎమ్మెస్ ఎ.రేవతి, వీఓఎలు కవిత, జ్యోతి, పద్మ, రమ, హైమ, అనిత, శోభ, ప్రవంతి, ఇందిర, మంజుల తదితరులు పాల్గొన్నారు.

'డీపీఎల్' పోస్టర్ ఆవిష్కరణ

ఎంజీఎం: డాక్టర్లు 'బీ ఫిట్ టు ట్రీట్' ఉద్దేశంతో వరంగల్ డాక్టర్స్ క్రికెట్ క్లబ్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సంయుక్తంగా ఈనెల 17 నుంచి 26 వరకు కాకతీయ మెడికల్ కాలేజీ మైదానంలో డాక్టర్స్ ప్రీమియర్ లీగ్ (డీపీఎల్) నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఐఎంఏ వరంగల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. పది రోజులు జరిగే ఈలీగ్‌లో 150 మంది డాక్టర్లు 8 బృందాలుగా ఏర్పడి 15 మ్యాచ్‌లు ఆడనున్నట్లు తెలిపారు. నిత్యం పని ఒత్తిడిలో ఉండే డాక్టర్లకు మానసిక ప్రశాంతతతో పాటు శారీరకంగా ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ఈ లీగ్ ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, సెక్రటరీ అజిత్ మహ్మద్, ఫైనాన్స్ సెక్రటరీ శిరీష్‌కుమార్, తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ రాష్ట్ర ట్రెజరర్ పి.విజయ చందర్‌రెడ్డి, డబ్ల్యూడీసీసీ సెక్రటరీ రాఘవేంద్ర ప్రదీప్, వైస్ ప్రెసిడెంట్ ప్రసన్న, ఐఎంఏ నాయకులు సంధ్యారాణి, జనార్దన్, బందెల మోహన్‌రావు, రమేశ్ పాల్గొన్నారు.

గొర్రెల స్కాం కలకలం!

ఓరుగల్లులో పశుసంవర్ధక శాఖలో మళ్లీ సెగ

- యూనిట్ల వివరాలు ఇవ్వాలని ఈడీ నోటీసులు
- డీవీఏహెచ్‌ఓలను ఆరా తీస్తున్న 'విజిలెన్స్'
- కొందరు వీఏఎస్‌లను విచారణకు పిలిచిన ఏసీబీ ?
- రిటైర్డ్ అయినా తప్పని ఎంక్వైరీ.. రిటైర్మెంట్ బెనిఫిట్స్‌పైనా పేచీ..



సాక్షిప్రతినిధి, వరంగల్: గొర్రెల పంపిణీ పథకంలో అక్రమాల బాగోతంపై మళ్లీ విచారణ ఉమ్మడి వరంగల్‌లో కలకలంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గొర్రెల పంపిణీలో అక్రమాల కేసును సీరియస్‌గా తీసుకుని విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే. దీంతో ఏడాది క్రితం వరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఏసీబీలు వేర్వేరుగా పలుకోణాల్లో విచారణ చేపట్టాయి. వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్థాయి మొదలు ఆ శాఖ కీలక అధికారుల వరకు సుమారు 42 మందిపై మూడు శాఖలు అభియోగాలు మోపాయి. ఇందులో ఎనిమిది మంది ఉమ్మడి వరంగల్‌లో పనిచేసిన వారు కూడా ఉన్నారు. సుమారు రూ.700 నుంచి రూ.1,200 కోట్ల వరకు స్కాం జరిగినట్లు ప్రాథమిక నివేదిక ఇచ్చిన నిఘావర్గాలు.. కొందరినీ అరెస్టు చేసి.. మరికొందరిపై శాఖాపరమైన చర్యలకు సిఫారసు చేశాయి. ఆ కేసుల్లో ఉండి ఏడాదిలో ఉద్యోగ విరమణ చేసిన నలుగురు అధికారుల బెనిఫిట్స్ కూడా నిలిపి వేశారు. తాజాగా ఈ కుంభకోణంలో కీలక వ్యక్తిగా కాంట్రాక్టర్ మొయినొద్దీన్ దుబాయికి పరారు కావడంతో అక్కడ బ్రేక్ పడింది. తాజాగా మొయినొద్దీన్‌కు సంబంధించిన ఇంటిపై దాడులు నిర్వహించి పలు డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్న ఏసీబీ.. ఆయన దగ్గర, ఆయన ద్వారా కొనుగోలు చేసిన పలువురిని విచారణకు పిలుస్తుండటం ఆశాఖలో కలకలం రేపుతోంది.

వీటిలోనే అక్రమాల లెక్కలు..

ఉమ్మడి వరంగల్‌లో 2017 జూలైలో గొర్రెల పంపిణీ పథకం ప్రారంభించారు. ఈ పథకం ద్వారా గ్రామాల్లోని గొల్ల, కురుమల కుటుంబాలను పరిగణనలోకి తీసుకొని గ్రామ సంఘంలో సభ్యత్వం ఉన్న వారికి రెండు విడతల్లో గొర్రెలు పంపిణీ చేశారు. మొదటి విడతలో 50 శాతం, రెండో విడతలో మరో 50 శాతం మంది చొప్పున 575 సహకార సంఘాలకు చెందిన 60 వేల మందికి మొదటి విడత(ఎ–లిస్టు)లో 49,276 యూనిట్లు పంపిణీ చేసినట్లు రికార్డులు చెబుతున్నాయి. ప్రతి యూనిట్‌కు 20 గొర్రెలు, ఒక పొట్టేలు చొప్పున జిల్లాల వారీగా కోటా నిర్ణయించారు. ఒక్కో జిల్లా నుంచి ఇద్దరు ఏడీలు, ఒక డాక్టర్, ఇద్దరు పారా సిబ్బంది కమిటీగా.. ఉమ్మడి జిల్లాలో సుమారు 12 కమిటీల ద్వారా కొనుగోళ్లు, పంపిణీ చేపట్టారు. రెండో విడతలో 47,750 యూనిట్లకు ప్రణాళిక సిద్ధం చేశారు. దాని ప్రకారం వరంగల్ అర్బన్ జిల్లాలో 5,571 యూనిట్లు, వరంగల్ రూరల్‌లో 12,748, మహబూబాబాద్‌లో 11,868, భూపాలపల్లి/ములుగు జిల్లాల్లో 6,791, జనగామ జిల్లాలో 10,772 యూనిట్లు పంపిణీ చేయాల్సి ఉండగా 12,123 యూనిట్ల తర్వాత అక్రమాలు వెలుగుచూడటంతో నిలిపివేశారు. ఆ తర్వాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సీరియస్‌గా విచారణకు ఆదేశించడం.. ఏడాది క్రితం అంతా అయిపోయిందని భావించిన తరుణంలో రెండు రోజులుగా మళ్లీ విచారణ స్పీడందుకుంది. ఉమ్మడి వరంగల్ అక్రమాలపైన మళ్లీ నోటీసులు జారీ కావడం లాంటి పరిణామాల నేపథ్యంలో బాధ్యులైన పశుసంవర్ధక శాఖ అధికారుల్లో మళ్లీ ఆందోళన మొదలైంది.

ఆరోపణలు ఎదుర్కొన్న అధికారులపై దృష్టి

ఇదిలా ఉండగా 2017 నుంచి 2024 వరకు గొర్రెల పంపిణీ పథకంలో కీలకంగా వ్యవహరించి ఆరోపణలు ఎదుర్కొన్న అధికారులపై మళ్లీ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ దృష్టి సారించింది. వరంగల్ కేంద్రంగా ఉన్న కార్యాలయానికి చెందిన ఇద్దరు అధికారులపై రెండు నెలల క్రితం హనుమకొండ డీవీఏహెచ్‌ఓ కార్యాలయంలో ఆరా తీశారు. అలాగే గతంలో ఆరోపణలు ఎదుర్కోవడంతో పాటు సస్పెన్షన్‌కు గురై తిరిగి కొలువులో చేరిన కొందరికీ హైదరాబాద్ నుంచి ఏసీబీ మూడు రోజుల క్రితం నోటీసులు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది.

యూనిట్ల వివరాలపై ఈడీ నోటీసులు..

గొర్రెల పంపిణీలో గోల్‌మాల్ వ్యవహారం మనీ ల్యాండరింగ్‌గా భావించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)..ఆ స్కాం గుట్టు తేల్చేందుకు చివరి ప్రయత్నంగా జిల్లాల వారీగా పంపిణీ చేసిన యూనిట్ల వివరాలు కోరింది. 2017 నుంచి 2024 వరకు పంపిణీ చేసిన యూనిట్ల సమాచారం కావాలని ఈ మేరకు జిల్లా వెటర్నరీ, పశుసంవర్ధకశాఖ అధికారులకు ఇచ్చిన నోటీసుల్లో ఈడీ పేర్కొంది. ఈ వివరాలు గత నెలాఖరు వరకే ఈడీకి సమర్పించాల్సి ఉండగా,కొందరు అబ్‌స్ట్రాక్టు మాత్రమే ఇచ్చి, మరి కొందరు సంపూర్ణంగా ఇవ్వగా.. రెండు జిల్లాల నుంచి సమాచారం వెళ్లలేదని తెలిసింది. పంపిణీ చేసిన గొర్రెల యూనిట్ల వివరాలు పంపించని అధికారులు ఈనెల 10 వరకు ఇవ్వాలని మరోసారి రిమైండర్ లేఖ పంపించినట్లు సమాచారం.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ సంధ్యారాణి
- కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో వినతుల స్వీకరణ



గ్రీవెన్స్ సెల్‌లో సమస్యలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి

న్యూశాయంపేట: ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం గ్రీవెన్స్ సెల్ నిర్వహించారు. కలెక్టర్ డాక్టర్ సత్యశారద ఆదేశాల మేరకు అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, డీఆర్‌డీఓ కౌసల్యాదేవి, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 119 దరఖాస్తులు రాగా.. వాటిని పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రెవెన్యూ 35, హౌసింగ్ 42 దరఖాస్తులు, మిగిలినవి ఇతర శాఖలకు వచ్చాయని ఆమె తెలిపారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అనురాధ మాట్లాడుతూ జిల్లాలోని వ్యవసాయ భూములను మండల అధికారి కార్యాలయం లేదా రైతు వేదికల్లో రిజిస్టర్ చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరిహారం అందించాలి..



నా వ్యవసాయ భూమిలో సీతాఫలం, మహాగణి చెట్లు ఉన్నాయి. ఫలాలు చేతికి వచ్చే సమయంలో 220 కేవీ విద్యుత్ లైన్ వేయడంతో నష్టం జరుగుతోంది. ప్రభుత్వం నుంచి నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి.

\- బండారి వెంకటేశ్వర్లు, మొగిలిచర్ల, గీసుకొండ మండలం

ఆర్‌ఐపై విచారణ జరిపించాలి..



పర్వతగిరి మండలం అన్నారం షరీఫ్ దర్గా ఎదుట ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారితో కుమ్మక్కైన ఆర్‌ఐపై విచారణ చేయాలి. ప్రభుత్వ భూమిని కాపాడాలని గ్రీవెన్స్ సెల్‌లో అధికారులకు వినతిపత్రం అందించాను.

\- వల్లందాస్ కుమార్, ఆర్‌ఎస్పీ జిల్లా కార్యదర్శి

స్వీపర్లకు వేతనాలివ్వాలి



విద్యాసంవత్సరం ప్రారంభమైనప్పటి నుంచి స్వీపర్లుగా పనిచేస్తున్నాం. విద్యాసంవత్సరం ముగిసినా ఇప్పటివరకూ మాకు వేతనాలు రాలేదు. దీంతో కుటుంబాల పోషణకు ఇబ్బంది అవుతోంది. అధికారులు స్పందించి తక్షణమే వేతనాలు చెల్లించాలి.

\- నర్సంపేట నియోజకవర్గ పాఠశాలల స్వీపర్లు

నేడు వాహనాల వేలం

వర్ధన్నపేట: ఎక్సైజ్ దాడుల్లో స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలను వర్ధన్నపేట ఎక్సైజ్ స్టేషన్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10గంటలకు వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ స్వరూప తెలిపారు. ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని వర్ధన్నపేట,రాయపర్తి, పర్వతగిరి,సంగెం మండలాల్లో పట్టుబడిన వాహనాలను జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ఆర్టీఓ నిర్ణయించిన అప్‌సెట్ ధరలో డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని ఆమె సూచించారు.

భూ సమస్యల పరిష్కారానికే 'భూ భారతి'

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, కలెక్టర్ సత్యశారద
- బండౌతపురం, కొత్తపల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు



సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, చిత్రంలో కలెక్టర్ డాక్టర్ సత్యశారద

వర్ధన్నపేట: రైతుల భూ సమస్యల పరిష్కారానికి తీసుకొచ్చిన గొప్ప చట్టం భూ భారతి అని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, కలెక్టర్ డాక్టర్ సత్యశారద పేర్కొన్నారు. భూ భారతి పైలట్ ప్రాజెక్టుగా వర్ధన్నపేట మండలాన్ని ఎంపిక చేశారు. ఇందులో భాగంగా సోమవారం బండౌతపురం, కొత్తపల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. హెల్ప్ డెస్క్, జనరల్ డెస్క్‌లను పరిశీలించి అధికారులకు వారు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్ ద్వారా అనేక మంది పేద రైతులు ఇబ్బందులకు గురయ్యారన్నారు. వేల ఎకరాల భూములు అన్యాక్రాంతమయ్యాయని, ప్రస్తుతం తమ ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి చట్టం రైతులకు ఎంతో మేలు కలుగుతుందని పేర్కొన్నారు. కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ జిల్లాలో భూసమస్యలు లేని మండలంగా వర్ధన్నపేటను తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. ఈనెల 14వ తేదీ వరకు మండలంలోని 12 రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు రెండు బృందాల ద్వారా సదస్సుల్లో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. సదస్సుల అనంతరం నెలలోపు భూ భారతి చట్టంతో భూ సమస్యలు పరిష్కరిస్తామని ఆమె వివరించారు. భూ భారతి చట్టంపై అవగాహన కల్పించి రైతుల సందేహాలను నివృత్తి చేశారు. బండౌతపురంలో 68, కొత్తపల్లిలో 81 దరఖాస్తులువ వచ్చినట్లు అధికారులు తెలిపారు. సదస్సులో డీఆర్‌ఓ విజలక్ష్మి, తహసీల్దార్ విజయసాగర్, ప్రజా ప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషిచేయాలి

- నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నర్సంపేట: గ్రామీణ ప్రాంతాల నుంచే కాంగ్రెస్ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సూచించారు. ఈ మేరకు పట్టణంలోని సిటిజన్ క్లబ్ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం కాంగ్రెస్ నియోజకవర్గ స్థాయి సంస్థాగత నిర్మాణంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.21 వేల కోట్లతో రైతు రుణమాఫీ చేశారని పేర్కొన్నారు. సన్న వడ్లకు రూ.500 బోనస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తూ రాష్ట్రంలో పథకాలను ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని వెల్లడించారు. ఎమ్మెల్సీ అమీర్‌ఖాన్ మాట్లాడుతూ నూతన కమిటీలు ఏర్పాటు చేసి పార్టీ బలోపేతానికి కృషిచేయాలని, దొంతి మాధవరెడ్డి నాయకత్వంలో కార్యకర్తలు బలంగా ఉన్నారని పేర్కొన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు చంద్రశేఖర్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, పీసీసీ సభ్యులు పెండెం రామానంద్, సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ పాలాయి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం కల్యాణలక్ష్మి

పేదింటి ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు వరమని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. ఈ మేర కు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం నియోజకవర్గానికి చెందిన లబ్ధిదారులకు రూ.2.40 కోట్ల విలువైన కలాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పాలా యి శ్రీనివాస్, తహసీల్దార్లు, అధికారులు, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

విద్యుత్ భద్రత పాటించాలి

- ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి

ఖిలా వరంగల్: విద్యుత్ భద్రత విషయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి సూచించారు. విద్యుత్ శాఖ భద్రతా వారోత్సవాల్లో భాగంగా సోమవారం వరంగల్ రంగశాయిపేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఎన్పీడీసీఎల్ వరంగల్ శాఖ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యుత్ ప్రమాదాల నివారణకు పెద్దపీట వేసి వినియోగదారులు, రైతులకు అవగాహన కల్పిస్తున్నామని, అధికారులు, సిబ్బందికి రక్షణ పరమైన పరికరాలు అందజేస్తున్నామని చెప్పారు. ఎదైనా సమస్య వస్తే 1912 టోల్ ఫ్రీ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే జేఎల్‌ఎం నియామకాలు చేపడుతామని పేర్కొన్నారు. సదస్సులో సూపరింటెండెంట్ ఇంజనీర్ కె.గౌతమ్‌రెడ్డి, డీఈ టెక్నికల్ ఆనందం, డీఈ ఆపరేషన్స్ మల్లికార్జున్, ఏడీ చంద్రమౌళి, సురేష్, కిశోర్ పాల్గొన్నారు.

పశుగ్రాసం తరలింపులో జాగ్రత్తలు..

- రైతులు అప్రమత్తంగా లేకుంటే విద్యుత్ తీగలతో ప్రమాదాలు

సాక్షి, వరంగల్: జిల్లాలో విద్యుత్ ప్రమాదాలు రైతులను కలవర పెడుతున్నాయి. ప్రస్తుతం రైతులు యాసంగి వరి కోతలు ప్రారంభించి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు. అదేవిధంగా పంటపొలాల్లోని వరి గడ్డి (పశుగ్రాసం)ని అవసరమయ్యే రైతులకు అమ్మేస్తున్నారు. ఈ క్రమంలోనే ఆ గడ్డిని ట్రాక్టర్లలో లోడ్ చేసుకుని వస్తుండగా ఆయా పంట క్షేత్రాల్లో వేలాడే విద్యుత్ తీగలతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఇటీవల అక్కడక్కడ జరుగుతున్న ఘటనలే నిదర్శనమని, వేసవి కాలంలో జాగ్రత్తలు పాటించాలని విద్యుత్ అధికారులు సూచిస్తున్నారు. పాడి రైతులు పశుగ్రాసాన్ని నిల్వ చేసుకునేందుకు ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేసుకుంటున్నారు. నేరుగా పొలాలకు వెళ్లి కట్టలు కట్టిన గడ్డిని ట్రాక్టర్లు, ఇతర వాహనాల్లో లోడ్ చేసుకొని తీసుకెళ్తున్నారు. ఈక్రమంలో ఆయా పొలాల్లో విద్యుత్ తీగలు కిందకి వేలాడుతుండడం, స్తంభాలు ఒరిగి ఉండడం తదితర కారణాలతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రస్తుతం ఈదురు గాలులు వీస్తుండటంతో చాలా చోట్ల స్తంభాలు వంగడం, విరిగిపోవడం, చెట్లు విరిగి తీగలపై పడుతున్నాయి. అధికారులు అప్రమత్తమై విద్యుత్ సరఫరా నిలిపివేసి మరమ్మతులు చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో మాత్రం అలాగే ఉంటున్నాయి. ఇవే ప్రమాదకరంగా మారుతున్నాయి.

విద్యుత్ తీగలు తగిలి గడ్డి లోడ్ ట్రాక్టర్ దగ్ధం



మంటల్లో దగ్ధమవుతున్న ట్రాక్టర్

వర్ధన్నపేట: విద్యుత్ తీగలు తగిలి గడ్డి లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ ప్రమాదవశాత్తు మంటల్లో దగ్ధమైన సంఘటన ఇల్లంద శివారులో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. కొత్తపల్లి గ్రామం నుంచి గడ్డి కట్టలను లోడ్ చేసుకుని కొత్తపల్లి –ఇల్లంద రోడ్డుపై వరంగల్‌కు ట్రాక్టర్ వెళ్తోంది. ఇల్లంద శివారులో రోడ్డుపై ఉన్న విద్యుత్ తీగలకు గడ్డి కట్టలు ప్రమాదవశాత్తు తగలడంతో మంటలు అంటుకున్నాయి. దీనిని గమనించిన ట్రాక్టర్ డ్రైవర్ మంటలను ఆర్పే ప్రయత్నం చేయగా.. మంటలు తీవ్ర రూపం దాల్చడంతో ట్రాక్టర్ నుంచి దూకి దూరం వెళ్లాడు. అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించగా వారు వచ్చే సరికి మంటల్లో ట్రాక్టర్ పూర్తిగా దగ్ధమైపోయింది. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు.

జాగ్రత్తలు ఇలా..

- పశుగ్రాసం తరలించే క్రమంలో వాహనం పరిమితికి మించి గడ్డిని ఎత్తుగా లోడ్ చేయకూడదు. విద్యుత్ తీగలు కిందకు ఉంటే నెమ్మదిగా వాటికి తగలకుండా తీసుకెళ్లాలి. లేదంటే సిబ్బందికి సమాచారమిచ్చి విద్యుత్ సరఫరా నిలిపివేయించాలి.
- పశుగ్రాసాన్ని లోడ్ చేసే సమయంలో విద్యుత్ తీగలకు కనీసం 10 నుంచి 15 అడుగుల దూరంలో ఉండేలా చూసుకోవాలి. ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వాలి. వేసవి నేపథ్యంలో వాహనాల్లో కూడా పలు కారణాలతో మంటలు చెలరేగే అవకాశం ఉంటుంది. ఒకసారి చెక్ చేసుకోవాలి.

విద్యుత్ సమస్యలుంటే సమాచారమివ్వాలి..

రైతులు తమ పంట పొలాల్లో తెగిన, వేలాడిన విద్యుత్ తీగలు ఉంటే వెంటనే అధికారులకు సమాచారమివ్వాలి. విద్యుత్‌కు సంబంధించిన సమస్యలు ఉంటే అధికారులను సంప్రదించాలి. గడ్డి లోడ్ చేసుకునే వెళ్లే ట్రాక్టర్ డ్రైవర్లు అన్ని నిశితంగా గమనించాలి. తీగలు తగులుతాయనుకుంటే సిబ్బందికి సమాచారమిస్తే కరెంట్ సరఫరా నిలిపేస్తారు.

\- మల్లికార్జున్, డీఈ, వరంగల్

భద్రకాళికి గంధోత్సవం



హన్మకొండ కల్చరల్ : శ్రీభద్రకాళి భద్రేశ్వరుల కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీభద్రకాళి దేవాలయంలో అమ్మవారికి గంధోత్సవం నిర్వహించారు. అర్చకుడు భద్రకాళి శేషు ఆధ్వర్యాన అమ్మవారి స్వపనమూర్తికి గంధంతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఉత్సవ మూర్తిని సాలభంజికవాహనంపై ప్రతిష్ఠించి ఊరేగించారు. పూజాకార్యక్రమాలకు ఉమ్మడి వరంగల్ జిల్లాల పద్మశాలి సంఘం వారు ఉభయదాతలుగా వ్యవహరించారు. జిల్లా అధ్యక్షుడు లయన్ డాక్టర్ ఆడెపు రవీందర్, మేయర్ గుండు సుధారాణి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభాకర్, కోఆర్డినేటర్ నరేందర్, కుసుమ సతీశ్, సాంబారి సమ్మారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఒత్తిడిని జయించాలి



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ

- నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ

కాజీపేట అర్బన్: విద్యార్థులు మానసిక ఒత్తిడిని జయించి ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించాలని నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ అన్నారు. నిట్ వరంగల్‌లోని అంబేడ్కర్ లెర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో సోమవారం బేర్ ఫుట్ కౌన్సెలింగ్ థీంతో ఏర్పాటు చేసిన రెండు రోజుల వర్క్‌షాప్‌ను నిట్ డైరెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అధ్యాపకులు విద్యార్థులకు మనోధైర్యాన్ని అందించేందుకు, ఉత్తమ విద్యను బోధించేందుకు, పరీక్షల్లో రాణించేందుకు రెండు రోజుల వర్క్‌షాప్ తోడ్పడుతుందని తెలిపారు. పోటీ ప్రపంచానికి అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో ఢిల్లీ ఎక్స్‌ప్రెషన్స్ ఇండియన్ నిపుణులు డాక్టర్ జితేంద్ర నాగపాల్, డాక్టర్ గీతా మెహ్రోత్రా, మాజీ డీజీపీ డాక్టర్ ఆదిత్య ఆర్య, డాక్టర్ అనంత మాధవమోహన్ మాట్లాడుతూ విద్యార్థులు మానసికంగా కుంగిపోయి ఆత్మహత్యలకు పాల్పడడం వంటి పిరికి చర్యలకు పాల్పడకుండా, ఓటమిని విజయంగా మలుచుకునేందుకు పాజిటివ్ మైండ్‌తో శ్రమించాలని సూచించారు.

నిట్‌తో హార్ట్‌ఫుల్ నెస్ సెంటర్ ఎంఓయూ...

నిట్ వరంగల్‌తో హైదరాబాద్‌లోని హార్ట్‌ఫుల్‌నెస్ సెంటర్ సోమవారం పరస్పర ఒప్పందం కుదుర్చుకుంది.

రేపు తెలుగుభాష పరిరక్షణపై చర్చా గోష్ఠి

హన్మకొండ కల్చరల్: తెలుగుభాష పరిరక్షణపై చర్చా గోష్ఠి ఈనెల 7న ఉదయం10 గంటలకు హనుమకొండ పింజర్లరోడ్డులోని రాజ రాజనరేంద్రాంధ్ర భాషానిలయంలో నిర్వహిస్తున్నట్లు కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ బన్న అయిలయ్య, ప్రముఖ కవి పొట్లపల్లి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. చర్చా గోష్ఠికి వరంగల్‌లోని కవులు, రచయితలు, భాషాభిమానులు హాజరు కావాలని కోరారు.

ఆత్మహత్యలతో సమస్యలు పరిష్కారం కావు

● హైకోర్టు జడ్జి జస్టిస్ రాజేశ్వరరావు



మహబూబాబాద్ రూరల్ : జీవితంలో సమస్యలకు ఆత్మహత్య పరిష్కారం కాదని, వాటి నివారణకు ప్రతిఒక్కరూ బాధ్యత వహించాలని హైకోర్టు జడ్జి జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు పేర్కొన్నారు. ఆత్మహత్యలు–నివారణ సదస్సు కరపత్రాలను జిల్లా కేంద్రంలోని అడ్వకేట్స్ కాలనీలో హైకోర్టు జడ్జి రాజేశ్వరరావు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవించడానికే జీవితం అని, ఆత్మహత్యలకు పాల్పడొద్దని, కష్టాలు ఎదురైనప్పుడు ధైర్యంతో ఎదుర్కొని ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. ఆత్మహత్యల నివారణ కమిటీ చైర్మన్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ మాట్లాడుతూ ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో త్వరలో పోలీసుల సహకారంతో ఆత్మహత్యలు–నివారణ సదస్సులు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి అండగా..



ఆర్థికసాయం అందజేస్తున్న సీపీ

వరంగల్ క్రైం : ఆకస్మికంగా మృతిచెందిన కానిస్టేబుల్ కుటుంబానికి తమవంతు బాధ్యతగా సేకరించిన ఆర్థికసాయాన్ని సోమవారం వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్ అందజేశారు. కమిషనరేట్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న బండారి కిరణ్ కుమార్ గతేడాది మరణించాడు. దీంతో తమ మిత్రుడి కుటుంబానికి అండగా ఉండాలనే ఆలోచనతో 2013 బ్యాచ్ కు చెందిన కానిస్టేబుళ్లు వరంగల్ కమిషనరేట్, ఆదిలాబాద్ జిల్లా పోలీస్ కానిస్టేబుళ్లతో పాటు ఇతర విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బంది రూ.2.50 లక్షల రికరింగ్ డిపాజిట్ పత్రాలతో పాటు రూ.37వేల నగదు ను సీపీ చేతుల మీదుగా బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. అదనపు డీసీపీ సురేష్ కుమార్, ఆర్ఐ సింహాచలం శ్రీనివాస్, కానిస్టేబుళ్లు శివ, రాజు పాల్గొన్నారు.


గుప్తనిధుల కోసం తవ్వకాలు.!

ఏటూరునాగారం : మండల కేంద్రంలోని జంపన్న వాగు కరకట్ట సమీపంలో ఓ ఇంట్లో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరుగుతున్నాయని గుర్తించిన అదే ప్రాంతానికి చెందిన అన్వర్ ఈనెల 2వ తేదీన రాత్రి 10:45లకు తన సెల్‌ఫోన్‌లో రికార్డు చేశాడు. గమనించిన సదరు వ్యక్తులు అన్వర్‌పై దాడి చేసి సెల్‌ఫోన్‌ను లాక్కొని వీడియోలు, ఫొటోలు డిలిట్ చేసినట్లు బాధితుడు అన్వర్ తెలిపారు. ఇదే విషయంపై సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వెల్ల డించారు. అసలు గుప్తనిధుల కోసం తవ్వారా? లేదా వారి ఇంటి అవసరాల కోసమా అనేది పోలీసులు విచారణ చేపట్టి తేల్చాల్సి ఉంది. కానీ గ్రామంలో మాత్రం గుప్తనిధుల కోసమే తవ్వినట్లు వినికిడి. అంతేకాకుండా బంగారు బిల్లలు కూడా దొరికినట్లు పుకార్లు షికార్లయ్యాయి. ఈ విషయంపై ఎస్సైను వివరణ కోరగా అన్వర్ ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ చేపట్టి కేసు నమోదు చేసి ద ర్యాప్తు చేస్తామని పేర్కొన్నారు.

‘సోలార్’పై విముఖత

రుణాలపై స్పష్టత ఇవ్వని బ్యాంకర్లు

● ఈఎండీ చెల్లించేందుకు ముందుకు రాని రైతులు
● ఉమ్మడి జిల్లాలో 682 దరఖాస్తులు
● ఈఎండీలు చెల్లించినది 162.. ముందుకు రాని వారు 520 మంది



ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా..

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 889.7 మెగావాట్లకు సరిపడా 682 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 210.6 మెగావాట్ల సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు 162 మంది రూ.లక్ష చొప్పున ఈఎండీ చెల్లించారు. 177.1 మెగావాట్లకు గాను 141 మందికి లెటర్ ఆఫ్ ఆక్సెప్టెన్సీ ఇచ్చారు. ఇంకా 520 మంది రైతులు సోలార్ ప్లాంట్ ఏర్పాటుపై విముఖతతో ఉన్నారు. దరఖాస్తు స్వీకరించడానికి గడువు పొడిగించిన ఆశించిన మేరకు దరఖాస్తులు రాలేదు. అదే విధంగా ఈఎండీ చెల్లించేందుకు దరఖాస్తులు ముందుకు రావడం లేదు.

హన్మకొండ : భారీ పెట్టుబడి.. గిట్టుబాటు కానీ ధర.. 12ఏళ్ల వరకు రైతుకు ప్రయోజనం లేకపోవడం.. రుణంపై బ్యాంకర్లకు స్పష్టత లేక పోవడం.. రైతు వాటాగా రూ.లక్షల్లో చెల్లించాల్సి రావడం.. ప్రతినెల ఆదాయం నిలకడగా వస్తుందనే నమ్మకం లేకపోవడం వెరసి సోలార్ ప్లాంట్ ఏర్పాటుపై రైతుల్లో తీవ్ర విముఖత వ్యక్తమవుతోంది. దరఖాస్తు చేసినప్పటి ఉత్సాహం ఈఎండీ చెల్లించడంలో రైతులు ఆసక్తి చూపడం లేదు. దీంతో పీఎం కుసుం పథకం ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. దరఖాస్తుల స్వీకరణకు మూడు సార్లు గడువు పొడిగించింది. ఇప్పుడు ఈఎండీలు చెల్లించడానికి రెండు సార్లు గడువు విధించింది. అయినా ఈఎండీలు చెల్లించడానికి రైతులు ముందుకు రావడం లేదు. దీంతో ఈ పథకం ఆశించిన మేర సఫలం కాలేక పోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అమలు

కేంద్ర ప్రభుత్వం సోలార్ విద్యుత్ ఉత్పత్తి పెంచేందుకు, సోలార్ ప్లాంట్ ఏర్పాటుపై రైతులను ప్రోత్సహించేందుకు ప్రధాన మంత్రి కిసాన్ ఉర్జా సురక్షా ఎవం ఉత్థాన్ మహాభియాన్ (పీఎం కుసుం) పథకాన్ని తీసుకు వచ్చింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకాన్ని అమలు చేస్తున్నాయి. తెలంగాణ పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ, టీజీ ఎన్పీడీసీఎల్, టీజీ ఎస్పీడీసీఎల్ ద్వారా ఈ పథకాన్ని అమలు చేస్తోంది. రైతులతో పాటు మహిళా స్వయం సహాయక సంఘాలు, రైతు ఉత్పత్తి సంఘాలు, సహకార సంఘాలు, పంచాయతీలు, నీటి వినియోగదారుల సంఘాలు సోలార్ ప్లాంట్‌లు ఏర్పాటు చేసుకోవడం ద్వారా సౌర విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు పథకాన్ని రూపొందించారు. ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను స్థానిక డిస్కంలు ముందుగా నిర్ణయించిన టారిఫ్ ధరలకు కొనుగోలు చేస్తాయి. సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు స్థలం 33/11 కేవీ సబ్ స్టేషన్‌కు ఐదు కిలోమీటర్ల లోపు దూరం మాత్రమే ఉండాలి. 500 కిలో వాట్ల నుంచి 2 మెగావాట్ల ఉత్పత్తి వరకు సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకోవచ్చు.

సోలార్ ప్లాంట్‌పై అవగాహన లేకనే..

ఒక మెగావాట్ సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్‌కు రూ.3 కోట్ల ఖర్చు అవుతుంది. ఇందులో రైతులు తమ వాటాగా 25 శాతం భరిస్తే, బ్యాంకుల ద్వారా 75 శాతం రుణ సదుపాయాన్ని కల్పిస్తామని ప్రభుత్వం చెప్పింది. కొన్ని బ్యాంకులకు సోలార్ ప్లాంట్‌పై అవగాహన లేదన్నారు. కనీసం 25 శాతం కింద రూ.3 కోట్ల వ్యయంలో రైతు వాటాగా రూ.75 లక్షలు భరించలేమని, అదే విధంగా ప్రభుత్వం యూనిట్‌కు చెల్లిస్తామని చెప్పిన రూ.3.13లు ఏటు సరిపోవన్నారు. 12 ఏళ్ల వరకు రుణ వాయిదాలు చెల్లించాల్సి రావడంతో అప్పటి వరకు రైతుకు ఒనగూరే ప్రయోజనం ఏమీ లేదని వాపోయారు. దీంతో తాము నష్టపోతున్నట్లు చెబుతున్నారు.

లాభదాయకంగా లేదు..



మా నాన్న పేరుపై వ్యవసాయ భూమి ఉంది. పీఎం కుసుం పథకం ద్వారా సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేద్దామని దరఖాస్తు చేశాం. యూనిట్ ధర చూస్తే ఏ మాత్రం లాభదాయకంగా లేదు. బ్యాంకర్లు రుణాలు ఇచ్చేందుకు సిద్ధంగా లేదు. 25 ఏళ్ల వరకు యూనిట్‌కు రూ.3.13 మాత్రమే చెల్లిస్తుండడం ఏ మాత్రం ప్రయోజనం కాదు. ఇతర రాష్ట్రాల్లో యూనిట్‌కు రూ.4 నుంచి రూ.4.50 వరకు చెల్లిస్తున్నారు. 14, 15 సంవత్సరాల వరకు వచ్చే ఆదాయం వాయిదాలకే వెళ్తుంది. తర్వాతే రైతు చేతికి ఆదాయం వస్తుంది. అప్పటి వరకు పరిస్థితులు ఎలా ఉంటాయోనని ఈఎండీ చెల్లించలేదు.

– పెసరు కార్తీక్ రెడ్డి, సూదనపల్లి, హనుమకొండ

జిల్లాల వారీగా వివరాలు..

జిల్లా	వచ్చిన		ఈఎండీ		ఎల్‌ఓఏ	
	దరఖాస్తులు-మెగావాట్లు		చెల్లింపు-మెగావాట్లు		జారీ-మెగావాట్లు	
హనుమకొండ	76	95.2	26	33.2	24	29.2
జేఎస్ భూపాలపల్లి	116	138.8	19	22.8	19	22.8
జనగామ	179	243.2	51	66	41	52
మహబూబాబాద్	127	177.3	41	57.6	33	43.6
ములుగు	50	70.2	5	5	4	4
వరంగల్	134	265	20	26	20	25.5

సరస్వతి పుష్కరాల ఏర్పాట్లు ముమ్మరం

● కలెక్టర్ రాహుల్‌శర్మ
● 10వ తేదీ వరకు పనులు పూర్తిచేయాలి



పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

కాళేశ్వరం : కాళేశ్వరంలో ఈనెల 15నుంచి 26వతేదీ వరకు జరిగే సరస్వతీ నది పుష్కరాలకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ రాహుల్‌శర్మ పేర్కొన్నారు. సోమవారం అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్‌తో కలిసి అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. సరస్వతీ(వీఐపీ) ఘాట్, సరస్వతీ మాతా విగ్రహం ఏర్పాటు, శాశ్వత, తాత్కాలిక మరుగుదొడ్ల నిర్మాణం పనులు పరిశీలించారు. టెంట్ సిటీ నిర్మాణానికి సంబంధిత ఏజెన్సీలతో మాట్లాడారు. త్వరగా నిర్మాణాలు చేపట్టాలన్నారు. ఈ నెల 10వ తేదీ వరకు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నేటినుంచి సరస్వతిమాత విగ్రహం ఏర్పాటు పనులు జరుగుతుందని తెలిపారు. వీఐపీ ఘాట్ వద్ద తోరణ నిర్మాణ పనులు తక్షణమే చేపట్టాలని ఎండోమెంట్ ఇంజనీర్లకు, కాంట్రాక్టర్లకు ఆదేశించారు. తాగునీరు, భక్తులు దుస్తులు మార్చు గదులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈఈ మహేష్, ఇరిగేషన్ ఈఈ తిరుపతి రావు, డీపీఓ వీరభద్రయ్య, జిల్లా వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్, ఆర్టీసీ డీఎం ఇందు, తహసీల్దార్ ప్రహ్లాద్ రాథోడ్, డీటీ కృష్ణ, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ శ్రీనివాస్, డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, ఎస్సై తమాషారెడ్డి పాల్గొన్నారు.

మూడు రోజులైతే మళ్లీ విధుల్లోకి..

● సెలవులపై వచ్చిన జవాన్.. రోడ్డు ప్రమాదంలో మృతి
● అందుగులగూడెంలో విషాదం



గౌరవ వందనం సమర్పిస్తున్న పోలీసులు



ప్రకాశ్ (ఫైల్)

కొత్తగూడ : కశ్మీర్‌లో విధులు నిర్వహిస్తున్న బీఎస్ఎఫ్ జవాన్ ఇటీవల సెలవులపై ఇంటికి వచ్చాడు. ఉగ్రవాదుల చర్యతో సెలవులు రద్దయ్యాయి.. మూడ్రోజులైతే మళ్లీ విధుల్లో చేరేవాడు. ఉన్న రెండ్రోజులు బంధువుల ఇళ్లల్లో శుభకార్యాలకు వెళ్లి సంతోషంగా గడపాలనుకున్నాడు.. కాని రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు ఒడిలోకి చేరుకున్నాడు. గంగారం మండలం అందుగులగూడెం గ్రామానికి చెందిన బీఎస్ఎఫ్ జవాన్ మద్దెల ప్రకాశ్(32) ఉద్యోగంలో చేరినప్పటి నుంచి దేశ రక్షణే ధ్యేయంగా విధులు నిర్వహిస్తూ గ్రామస్తులతో కలివిడిగా ఉండేవాడు. గోవిందాపూర్ గ్రామంలో శుభకార్యానికి బంధువుల ఇంటికి ఆదివారం వెళ్లిన అతను రాత్రి తిరిగి వస్తుండగా పెగడపల్లి సమీప మలుపు వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ప్రకాశ్ తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. ఎస్సై కుశకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నా జీవితం భరతమాత రక్షణకే అంటివి: జవాన్ భార్య అనిత

నా జీవితం భరతమాత రక్షణకే అంటివి కదా అయ్యా.. నీవు లేకుండా నేనెట్లా బతికేది అంటూ జవాన్ ప్రకాశ్ భార్య అనిత రోదనలు మిన్నంటాయి. బార్డర్‌లో ఉన్నా.. నాకు నువ్వు ఉన్నావనే ధైర్యం ఉండేది.. ఇప్పుడు నాకెవరు ధైర్యం అంటూ రోదించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది. అనంతరం బీఎస్ఎఫ్ జవాన్ మద్దెల ప్రకాశ్‌కు కొత్తగూడ, గంగారం మండలాల పోలీసులు గౌరవ వందనం చేస్తూ అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి

● డీఏఓ ఎం.విజయనిర్మల, మల్యాల కేవీకే సమన్వయకర్త డాక్టర్ ఎస్.మాలతి
● ‘రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు’ ప్రారంభం



మాట్లాడుతున్న డీఏఓ విజయనిర్మల

మహబూబాబాద్ రూరల్ : రైతులు తమ పంటల సాగుతో రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి, పంట మార్పిడి చేసి, పర్యావరణ పరిరక్షణకు చెట్లను పెంచాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎం.విజయనిర్మల, మల్యాల కేవీకే సమన్వయకర్త డాక్టర్ ఎస్.మాలతి పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ, మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. యూరియా వాడకాన్ని వీలైనంత తక్కువగా చేపట్టాలని, తద్వారా పెట్టుబడిని తగ్గించుకుని నేల ఆరోగ్యాన్ని కాపాడాలని సూచించారు. జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమల అధికారి మరియన్న మాట్లాడుతూ వాణిజ్య పంటలతో పాటు ఆయిల్‌పామ్, కూరగాయల సాగుపై దృష్టి కేంద్రీకరించాలని పేర్కొన్నారు. మల్యాల కేవీకే శాస్త్రవేత్త బి.క్రాంతికుమార్ మాట్లాడుతూ ముఖ్యంగా పచ్చిరొట్ట పంటల సాగు, మట్టి పరీక్షలు చేయించడం, జీవన ఎరువులు వాడడం, వానాకాలం సాగు చేసే పంటల్లో రకాలు, యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ ఈ.రాంబాబు మాట్లాడుతూ మిర్చి సాగు తగ్గించుకుని ఇతర కూరగాయల పంటలు సాగు చేయాలని సూచించారు. విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ ఎన్.కిషోర్ కుమార్ మాట్లాడుతూ పప్పు, నూనె గింజ పంటల సాగు, వాటి రకాల గురించి తెలియజేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎం.మల్లయ్య, ఏడీఏ అజ్మీరా శ్రీనివాసరావు, ఉద్యాన అధికార శాంతిప్రియ, ఏఈఓలు రంజిత్, సాయిప్రకాష్, పూజిత, పున్నమి, రైతులు పాల్గొన్నారు.

‘ఆపరేషన్ కగార్’ను నిలిపివేయాలి

● మావోయిస్టులతో చర్చలు జరపాలి
● కేయూలో విద్యార్థి సంఘాల ర్యాలీ



కేయూలో ర్యాలీ నిర్వహిస్తున్న వివిధ విద్యార్థి సంఘాల నాయకులు, భారత్ బచావో బాధ్యులు

కేయూ క్యాంపస్ : ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపి వేయాలని, కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరపాలని డిమాండ్ చేస్తూ సోమవారం కాకతీయ యూనివర్సిటీలో వివిధ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. క్యాంపస్‌లోని ప్రిన్సిపాల్ కార్యాలయం నుంచి యూనివర్సిటీ మొదటి గేట్ వరకు శాంతిర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న భారత్ బచావో బాధ్యుడు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు రాంబ్రహ్మం మాట్లాడుతూ దండకారణ్యంలో కేంద్రం కొనసాగిస్తున్న ఆపరేషన్ కగార్‌ని ఆపివేసి, మావోయిస్టులతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. అపార ఖనిజ సంపద కార్పొరేట్ బహుళజాతి కంపెనీలకు అప్పగించేందుకు అడ్డంకిగా ఉన్న మావోయిస్టులను, ఆదివాసీలను లేకుండా చేయాలనే కుట్రలో భాగంగానే కేంద్రప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను చేపట్టిందని ఆరోపించారు. ర్యాలీలో డీఎస్ఏ రాష్ట్ర కన్వీనర్ కామగోని శ్రావణ్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మర్రి మహేష్, బీఎస్ఎఫ్ యూనివర్సిటీ అధ్యక్షుడు శివ, భారత్ బచావో బాధ్యులు వెంగల్ రెడ్డి, రాజా మహ్మద్, సదానందం, అరసం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మార్క శంకర్ నారాయణ, వివిధ విద్యార్థి సంఘాల బాధ్యులు ఉప్పుల శివ, మహేష్, రాజేష్, శివ, సన్నీ పాల్గొన్నారు.

తెలంగాణకు పట్టిన శని కాంగ్రెస్ పార్టీ

● ఏపీ సీఎం చంద్రబాబు ఏజెంట్ రేవంత్‌రెడ్డి
● కాళేశ్వరం ప్రాజెక్టు రిపేర్ చేయకుండా నిర్వీర్యం చేస్తుండ్రు
● శాసనమండలి ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి
● కాళేశ్వరం ప్రాజెక్టుపై చర్చ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు



మాట్లాడుతున్న శాసనమండలి ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి

కాళేశ్వరం: కాంగ్రెస్ పార్టీ తెలంగాణకు పట్టిన శని, దరిద్రం అని శాసనమండలి ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి అన్నారు. సోమవారం జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో ‘కాళేశ్వరం ప్రాజెక్టుపై చర్చ.. వాస్తవాలు’ అనే కార్యక్రమాన్ని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఇందులో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, వాటర్‌బోర్డు కార్పొరేషన్ మాజీ చైర్మన్ వి.ప్రకాశ్, మాజీ ఎమ్మెల్యేలు నడిపెల్లి దివాకర్‌రావు, విద్యాసాగర్‌రావు, చిన్నయ్య, చందర్, మాజీ జెడ్పీచైర్‌పర్సన్‌లు శ్రీహర్షిణి, వసంత పాల్గొన్నారు. ఈ సందర్భంగా మధుసూదనాచారి మాట్లాడుతూ.. కేసీఆర్ మానస పుత్రిక కాళేశ్వరం ప్రాజెక్టుతో తెలంగాణ అంతటికీ సాగు, తాగునీరందించారని, అలాంటి ప్రాజెక్టుకు రిపేర్లు చేయకుండా సీఎం రేవంత్‌రెడ్డి ఏపీ సీఎం చంద్రబాబుకు ఏజెంట్‌గా వ్యవహరిస్తున్నట్లు ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌కు నీటిని తరలించడానికి కాళేశ్వరం ప్రాజెక్టుకు రిపేర్లు చేయడంలేదని, తెలంగాణ రైతులపై చిత్తశుద్ధి ఉంటే మంత్రి శ్రీధర్‌బాబు రిపేర్లు చేయించాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ.. ఒక్క పిల్లర్ కుంగితే మొత్తం ప్రాజెక్టు కుంగినట్లు సీఎం రేవంత్ రెడ్డి ప్రతిసమావేశాల్లో ప్రస్తావిస్తున్నారని, ప్రాజెక్టుపై దుష్ప్రచారాన్ని ప్రజలు తిప్పికొట్టాలన్నారు. నీటిరంగ నిపుణులు వి.ప్రకాశ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో బ్యారేజీలు కూలిపోడమే సీఎం రేవంత్ రెడ్డి ఆశయమని, మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడంలో ఎవరికీ అనుమానం లేకున్నా.. తనకుందని అనడంలో కుట్ర దాగి ఉన్నదని పేర్కొన్నారు. బ్యారేజీ కుంగిపోవడం, భారీ శబ్దం రావడంపై ఇప్పటికీ ఎన్‌డీఎస్ఏ నివేదికలు ఇవ్వలేదని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు మాట్లాడుతూ.. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం కళ్లు తెరిచి ప్రాజెక్టుకు మరమ్మతులు చేసి రైతంగానికి నీటిని అందించాలన్నారు. అంతకు ముందు గోదావరిని పరిశీలించారు.

పద్దెనిమిదేళ్లకు ఎల్లమ్మ జాడ..

● 10న కేరళ టు తెలంగాణకు రాక
● సోషల్ మీడియా ప్రభావంతో నిర్ధారణ



కేరళలో ఆచూకీ తెలిసిన ఎల్లమ్మ

దేవరుప్పుల : మతిస్థిమితం కోల్పోయి పద్దెనిమిదేళ్ల క్రితం తప్పిపోయిన చింత ఎల్లమ్మ ఎట్టకేలకు మరో ఐదు రోజుల్లో స్వగ్రామానికి చేరుకోనుంది. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన చింత వెంకమ్మ, సోమయ్య కూతురుకు రఘునాథపల్లి కన్నాయిపల్లికి చెందిన వ్యక్తితో వివా హం చేశారు. ఈమెకు ఇద్దరు కుమారులు జన్మించాక మతిస్థిమితం కోల్పోయి ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు తిరిగి వేసారిపోయారు. ఈ క్రమంలో కేరళలోని ఓ క్రైస్తవ స్వచ్ఛంద సంస్థ ఆశ్రమంలో ఉంటున్న ఎల్లమ్మను నిర్వాహకులు ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎల్ల మ్మ తమదీ దేవరుప్పుల కట్టకాడీ ఇల్లు అని, అత్తగారు కన్నాయిపల్లె అని, ఇద్దరు కొడుకులు ఉన్నారని, ఇద్దరు అమ్మలు ఉన్నారని పేర్కొన్న విషయాలను వీడియో రూపంలో వైరల్ చేశారు. దీంతో ఈ విషయమై అప్పిరెడ్డిపల్లె మాజీ సర్పంచ్ పులిగిళ్ల సుధాకర్ కేరళలో తనకు పరిచయం ఉన్న క్రైస్తవ మతపెద్దలతో మాట్లాడారు. ఎట్టకేలకు ఎల్లమ్మ మాదిరి తప్పిపోయి అక్కడ ఉంటున్న ఐదుగురు మహిళల్లో నలుగురు ఆంధ్రప్రదేశ్, ఒకరు తెలంగాణవాసీగా ఆశ్రమ నిర్వాహకులు నిర్ధారించుకున్నారు. ఈ నెల 10వ తేదీన వారి వారి స్వగ్రామాలకు వచ్చి అప్పజెప్పేందుకు వస్తున్నట్లు సుధాకర్ తెలిపారు.

పురుడు కార్యం.. ప్రాణం తీసింది

● భర్త వేధింపులకు బాలింత ఆత్మహత్య



నిరోషా మృతదేహం

చిట్యాల : భర్త వేధింపులు తట్టుకోలేక మనస్తాపం చెందిన బాలింత ముదిగొండ నిరోషా (26) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని ముచినిపర్తిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని ముచినిపర్తికి చెందిన కందికొండ నిరోషాను వరంగల్ జిల్లా దేశాయిపేటకు చెందిన ముదిగొండ ప్రశాంత్‌తో గతేడాది వివాహం కాగా వీరికి పాప జన్మించింది. ఈక్రమంలో పాపకు 11వ రోజు పురుడు చేయాలని భర్త ప్రశాంత్, అత్త లక్ష్మి గత నెల 30న నిరోషా వద్దకు వచ్చారు. దీంతో ప్రశాంత్ మామ శంకర్ తమ వంశంలో పురుడు చేసేది లేదని చెప్పాడు. అయితే మేమే పురుడు చేసుకుంటామని రూ.లక్ష అదనంగా ఇవ్వమని అల్లుడు అడగ్గా తమ దగ్గర అంత డబ్బులు లేవని చెప్పాడు. దీంతో అల్లుడు, అతడి తల్లి గొడవపడి వెళ్లిపోయారు. ఆదివారం ప్రశాంత్..నిరోషాతో ఫోన్‌లో ఏం మాట్లాడాడో తెలియదని, మనస్తాపం చెంది ఇంట్లో పురుగుల మందు తాగిందని తెలిపారు. కుటుంబ సభ్యులు వెంటనే సివిల్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందినట్లు వారు చెప్పారు. అల్లుడు ప్రశాంత్, అతడి తల్లి లక్ష్మి, తండ్రి సాంబయ్యల ఒత్తిడి మూలంగానే తన కూతురు ఆత్మహత్య చేసుకుందని మృతిరాలి తండ్రి శంకర్ సోమవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రెయినింగ్ ఎస్సై హేమ పేర్కొన్నారు.

ప్లాట్ విక్రయించేందుకు వెళ్లి..

● బైక్‌ను ఢీకొన్న కారు ● చెల్లెలు మృతి, అన్నకు గాయాలు



విజయ (ఫైల్)

రఘునాథపల్లి : హనుమకొండ–హైదరాబాద్ జాతీయ రహదారిపై గోవర్ధనగిరి దర్గా సమీపంలో బైక్‌ను వెనకనుంచి కారు వేగంగా ఢీకొట్టడంతో చెల్లెలు మృతి చెందగా అన్న గాయపడిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. స్టేషన్‌ఘన్‌పూర్ మండలం చాగల్లు గ్రామానికి చెందిన మట్టెవాడ విజయ (45) భర్త చనిపోవడంతో పిల్లలతో కలిసి హైదరాబాద్‌లో నివాసం ఉంటూ జీవనం సాగిస్తోంది. గ్రామంలోని స్థలాన్ని (ప్లాట్) విక్రయించేందుకు తల్లిగారి గ్రామం కోమల్లకు వెళ్లి సోదరుడు గాదె లింగస్వామితో ద్విచక్రవాహనంపై చాగల్లుకు బయలుదేరింది. అక్కడ పనులు ముగించుకొని తిరిగి సోదరుడి బైక్‌పై పుట్టింటికి వస్తుండగా గోవర్ధనగిరి దర్గా సమీపంలో వరంగల్ నుంచి హైదరాబాద్ వైపు అతి వేగంగా వెళ్తున్న కారు వీరి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో వెనకాల కూర్చున్న విజయ ఎగిరి రోడ్డుపై పడటంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. సోదరుడు లింగస్వామికి గాయాలు కాగా స్థానికులు జనగామ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. జనగామ రూరల్ సీఐ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై దూదిమెట్ల నరేష్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.. మృతురాలికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

శుభకార్యానికి వెళ్తూ..

కెనాల్ గుంతలో పడి భార్య మృతి.. భర్త పరిస్థితి విషమం



విజయ మృతదేహం

గార్ల : బంధువుల ఇంట్లో శుభకార్యానికి ద్విచక్రవాహనంపై వెళ్తూ ప్రమాదవశాత్తు కెనాల్ గుంతలో పడగా, భార్య మృతిచెందగా భర్త పరిస్థితి విషమంగా ఉన్న సంఘటన సోమవారం రాత్రి తిర్లాపురం గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం..ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం నెమలిపురి తండాకు చెందిన సపావట్ విజయ (40), భర్త భాష్‌సింగ్ బైక్‌పై గార్ల మండలం తిర్లాపురంలో బంధువుల ఇంట్లో శుభకార్యానికి వస్తున్నారు. మరో రెండు నిమిషాల్లో తిర్లాపురం చేరుకునే వారు. గ్రామ సమీపంలో సీతారామ ప్రాజెక్ట్ కాల్వ నిర్మాణానికి వారంక్రితం రహదారిని తొలగించిన కాంట్రాక్టర్ సుమారు 40 మీటర్ల గుంత తవ్వారు. రహదారిని తొలగించిన విషయం తెలియక వీరు రహదారి ఉందనుకొని చీకట్లో గమనించకుండా భార్యభర్తలు గుంతలో బైక్‌తో సహా పడిపోయారు. ఈ ప్రమాదంలో భార్య విజయ అక్కడికక్కడే మృతిచెందగా, భర్త భాష్‌సింగ్‌కు తీవ్రగాయాలతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. కాగా గుంతలో రాళ్లు ఉండటంతో బైక్ పడిపోయిన సమయంలో భారీ శబ్దం రావడంతో స్థానికులు గమనించి వెళ్లే సరికే వీరు అందులో పడి ఉన్నారు. సీతారామ ప్రాజెక్ట్ కాంట్రాక్టర్ రహదారి వద్ద ఎలాంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగిందని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

కాల్వ వద్ద మృతదేహంతో గ్రామస్తుల ఆందోళన

సీతారామ ప్రాజెక్ట్ కాల్వ వద్ద విజయ మృతదేహంతో గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. కాంట్రాక్టర్ వచ్చేవరకు మృతదేహాన్ని తరలించేది లేదంటూ ఆమె బంధువులు, గ్రామస్తులు ఆందోళనకు దిగారు. కాంట్రాక్టర్ వచ్చిన తర్వాతే మృతదేహాన్ని తరలిస్తామని వారు పోలీసులతో తేల్చి చెప్పారు. గార్ల, బయ్యారం సీఐ బి.రవికుమార్, ఎస్సై ఎస్‌కె రియాజ్‌పాషా సంఘటనా స్థలం వద్దకు చేరుకొని మృతురాలి బంధువులతో చర్చలు జరుపుతున్నట్లు తెలిసింది.

వడదెబ్బతో మహిళ మృతి



పార్వతి (ఫైల్)

గార్ల : వడదెబ్బతో మహిళ మృతిచెందిన సంఘటన సోమవారం గార్లలో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా గార్లలోని అంబేడ్కర్‌నగర్‌కు చెందిన అక్కి పార్వతి (51) రెండ్రోజుల క్రితం మిరప తోటలో కాయలు ఏరేందుకు పనికి వెళ్లింది. ఆదివారం నుంచి వాంతులు, విరోచనాలు కావడంతో అపస్మారక స్థితికి వెళ్లింది. గమనించిన కుటుంబ సభ్యులు సీహెచ్‌సీకి తరలించగా, ఆమె ఆరోగ్యం మరింత క్షీణించింది. అక్కడి నుంచి 108 అంబులెన్స్‌లో మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే ఆమె మృతిచెందిందని వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని డాక్టర్ రాజ్‌కుమార్ జాదవ్, తహసీల్దార్ ఆర్.శారద, ఎస్సై ఎస్‌కె రియాజ్‌పాషా సందర్శించి ఆమె మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.